క్లుప్తంగా

రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు వై.సీతారామిరెడ్డి

పెద్దకడబూరు: మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలో సర్పయోగి విద్యాసాగరనంద స్వామి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మాత శరవాంబదేవి, కాశీ విశ్వనాథస్వామి ఆలయ ప్రారంభ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభం ప్రతిష్ట చేపట్టారు. అలాగే పూజలకు హాజరైన వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు వై.సీతారామిరెడ్డి.. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సూచనలతో ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళంగా అర్చకులకు అందించారు.

మండల ఉపాధ్యక్షుడి ఎన్నిక వాయిదా

పెద్దకడబూరు: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరగాల్సిన మండల ఉపాధ్యక్షుడి ఎన్నిక వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయం చేరుకున్న ప్రత్యేకాధికారి అశ్వత్థామ, ఎంపీడీఓ ప్రభాకర్ ఎంపీటీసీ సభ్యుల కోసం వేచి చూశారు. నిర్ణీత సమయం వరకు ఎవ్వరూ రాకపోవడంతో ఎన్నికను వాయిదా వేశారు. తిరిగి ఎన్నికను ఎప్పుడు నిర్వహించాలన్నది త్వరలో వెల్లడిస్తామన్నారు.

అవోపా బాలల వేసవి శిబిరం ముగింపు ఉత్సవం



శిక్షణ ఇచ్చిన వారితో అవోపా సభ్యులు

ఆదోని అర్బన్: అవోపా ఆధ్వర్యంలో జరుగుతున్న బాలల వేసవి శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం వైశ్య హాస్టల్‌లో ఘనంగా నిర్వహించారు. వేదిక్ మ్యాథ్స్, అబాకస్, చెస్, సంగీతం, శ్లోకాలు, ఆర్ట్ వర్క్ పై పది రోజులపాటు శిక్షణ ఇచ్చిన కవిత, మమత, రాణి, తులసి, పద్మ తదితరులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్షులు శ్రీనాథ్ గుప్తా, సభ్యులు వీరన్నశెట్టి, పఠనాలయం సభ్యులు సనత్‌కుమార్, రాజు, మహిళా విభాగ్ సెక్రటరీ మమతశ్రీ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల మంజూరుపై హర్షం



మాట్లాడుతున్న బీసీ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు డాక్టర్ వీరేష్

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం డిగ్రీ కళాశాలను మంజూరుపై బీసీ ఫెడరేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక బీసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు డాక్టర్ వీరేష్, రాష్ట్ర ఉపాధ్యాక్షుడు దస్తగిరి మాట్లాడుతూ గత ఏడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదోని పర్యటనకు వచ్చినప్పుడు హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కళాశాల మంజూరు చేసి, తరగతులను ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించడం సంతోషకరమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డికి బీసీ ఫెడరేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీసీ ఫెడరేషన్ గౌరవ సలహాదారులు ధణాపురం శేషన్న, జాయింట్ సెక్రటరీ బి.రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతావాణి

ఆదోని రూరల్: జగనన్న కాలనీల లబ్ధిదారులు వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ గీతావాణి సూచించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవన సమావేశంలో మండలంలోని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. మండలంలో మొత్తం 185 ఇళ్లకు గానూ 70 మాత్రమే ప్రారంభించారని, మిగతా వాటిని కూడా ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో హౌసింగ్ డీఈ రవికుమార్, ఏపీఎం జనార్దన్ పాల్గొన్నారు.

పట్టా మంజూరుకు సబ్‌కలెక్టర్ చర్యలు

ఆదోని రూరల్: నందవరం మండలం హాలహర్వికి చెందిన మాల జయలక్ష్మికి వెంటనే పట్టా మంజూరు చేయాలని స్థానిక అధికారులను సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. నందవరం తహసీల్దార్ నిత్యానందయ్య, నందవరం ఎస్‌ఐ మహేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం హాలహర్వి గ్రామాన్ని సందర్శించి సర్వేనంబర్ 407 గ్రామకంఠం భూమిలో వేసిన జగనన్న లేఅవుట్‌ను పరిశీలించి మాల జయలక్ష్మికి స్థానిక సర్వేయర్‌లతో సర్వే చేయించి రెండు మూడురోజుల్లో శాశ్వతమైన పట్టా, పరిష్కారమార్గం చూపుతామన్నారు.

రెండు దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న ఆదోనివాసుల స్వప్నం నెరవేరింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కల సాకారమైంది. ప్రయివేట్ కళాశాలల్లో వేలకు వేలు ఫీజు, డొనేషన్లు చెల్లించి ఉన్నత చదువులు చదవలేక కొందరు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ పిల్లలను మంచి విద్యాబుద్ధులు చెప్పించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని మరికొందరి తల్లిదండ్రుల చిరకాలవాంఛ నేటితో నెరవేరింది. ఆదోనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ ప్రాంత పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – ఆదోని టౌన్

స్వప్నం సాకారం

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సీఎం ఉత్తర్వులు జారీ
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఆదోని డివిజన్ గ్రామీణప్రాంత పేద విద్యార్థులు

ఆదోనిలో డిగ్రీ కళాశాల ఆవశ్యకతపై విద్యార్థులు, విద్యార్థి సంఘాలు 20 యేళ్లుగా డిమాండ్ చేస్తూనే ఉన్నారు. కానీ గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. యేడాది గడవకముందే ఆదోనికి డిగ్రీ కళాశాల మంజూరుతో పాటు ప్రిన్సిపాల్, లెక్చరర్లను నియమిస్తూ ఈనెల 6 ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

అందుబాటులో మరిన్ని కోర్సులు



2003లో కాంట్రాక్ట్ పద్ధతిన అధ్యాపకుడిగా చేరాను. నేడు ప్రభుత్వం మమ్మలన్ను రెగ్యులర్ చేసింది. చాలా సంతోషంగా ఉంది. విద్యార్థులు, ఉపాధ్యాయుల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపుతోంది. పట్టణంలో డిగ్రీ కళాశాలను మంజూరు చేయడం హర్షణీయం. 20 యేళ్లుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఆర్ట్స్, సైన్స్, కామర్స్ గ్రూపులను ప్రవేశపెట్టడం శుభ పరిమాణం.
– సూర్యబాబు, లెక్చరర్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల



ఆదోనిలో తాత్కాలిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం

కల నెరవేరింది



ఆదోనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంతో ఎన్నో యేళ్ల నాటి కల నెరవేరింది. పేద విద్యార్థుల కోసం ఎన్నో పోరాటాలు చేశాం. ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఏ ప్రభుత్వం విద్యార్థుల సమస్యను పరిష్కరించలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం కళాశాలను మంజూరు చేశారు. ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు.
– శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు

డిగ్రీ కళాశాల మంజూరు హర్షణీయం



డిగ్రీ కళాశాల మంజూరు చేయడం హర్షణీయం. సొంత భవనం, పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించాలి. ఆదోని ప్రాంతంలో ఎక్కువగా పేద విద్యార్థులే ఉన్నారు. పేద విద్యార్థులకు ఇది మంచి అవకాశం. ప్రభుత్వం మంజూరు చేసిన కళాశాలతో ఆదోనికి మంచి రోజులు వచ్చాయి. – రాజు, డీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు

శుభపరిణామం



ప్రతి విద్యార్థి చదువుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత కల్పిస్తోంది. నాడు–నేడు పథకం కింద స్కూళ్లు, కళాశాలలకు భవనాలు, వసతులు కల్పించింది. ప్రయివేట్ కళాశాలలకు దీటుగానే ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు చదువుకునేలా విప్లవాత్మక సంస్కరణలను చేపట్టింది. చదువే జీవనాధారం. ప్రతి విద్యార్థి చదువుకోవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ఈ తరుణంలో ఆదోనికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయడం శుభపరిణామం. – సుధాకర్, ఉపాధ్యాయుడు

కళాశాల ప్రారంభోత్సవానికి మంత్రి రాక



ఎమ్మెల్యే సాయి

ఆదోని టౌన్: మండలంలోని విరుపాపురం–సాదాపురం గ్రామాల మధ్య నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభోత్సవానికి ఈనెల 12న ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హాజరుకానున్నట్లు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తననివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. పాలిటెక్నిక్ కళాశాలతో పాటు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించనున్నామన్నారు.

శ్రీ మఠంలో హాస్య నటుడు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని హాస్యనటుడు తిరుపతి ప్రకాష్ శుక్రవారం దర్శించుకున్నారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి శ్రీ మఠం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. తిరుపతి ప్రకాష్‌రావడంతో అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఫొటోలు దిగారు.

నివాళి

కౌతాళం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కుంటనహల్ ఇబ్రహీం సాబ్ (78) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూమి తెలిపారు. కాగా ఇబ్రహీం సాబ్‌కు భార్య జులేఖబి (మాజీ సర్పంచ్), ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ప్రశాంత జీవనం గడపండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

కౌతాళం: గ్రామాల్లో గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంత జీవనం గడపాలని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన సీఐ ఎరిషావలితో కలిసి రౌడూరు గ్రామంలో పర్యటించారు. స్థానిక బస్టాండ్ ఆవరణంలో గ్రామస్తులతో మాట్లాడుతూ వివాదాలకు దూరంగా ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఫ్యాక్షన్ గొడవల వల్ల ఎన్నో కుటుంబాలు నాశనమయ్యాయని అలాంటి వాటికి స్వస్తి పలికి పిల్లలను ఉన్నత చదువులు చదివించి ఉద్యోగాల్లో స్థిరపడేలా చూడాలన్నారు. ఏదైనా సమస్య వస్తే గ్రామ పెద్దల జోక్యంతో రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు.

వాహనాలకు ఫిట్‌నెస్ ఉంటేనే రోడ్లపై తిప్పాలి



మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని అర్బన్: వాహనాలకు ఫిట్‌నెస్ ఉంటేనే రోడ్లపై తిప్పాలని డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. శుక్రవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ట్రాఫిక్ సీఐ పార్థసారథి ఆధ్వర్యంలో ప్రయివేట్ కళాశాలల, పాఠశాలల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ 60 యేళ్లు నిండిన వారిని పాఠశాలల బస్సులకు డ్రైవర్లుగా నియమించుకోవదన్నారు. డ్రైవర్‌ను మార్చినప్పుడు కూడా అతని గురించి పోలీస్‌స్టేషన్‌లో విచారించాలన్నారు. బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్సు, ఫిర్యాదు పెట్టే, నోటు పుస్తకం అందుబాటులో ఉంచాలన్నారు. తల్లిదండ్రులతో సమావేశమై బస్సుల నిర్వహణపై జాగ్రత్తలను వారికి తెలియజేసి సంతృప్తి పరచాలన్నారు. సమావేశంలో ప్రయివేట్ కళాశాలలు, పాఠశాలల కరస్పాండెంట్లు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

పాతపెన్షన్ విధానం అమలు చేయాలి



ఆవిర్భావ దినోత్సవంలో ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి నాగరాజు కోరారు. ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఓపీఎస్ బదులు జీపీఎస్ ఇస్తామనడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వీరచంద్ర యాదవ్, సుంకన్న, రామాంజి, మహాదేవప్ప, గోపాల్, రామప్ప, వేంకటేశ్వర్లు, అంజి పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్ల పంపిణీకి కసరత్తు



పుస్తకాలను సర్దుతున్న సిబ్బంది

ఆదోని సెంట్రల్: ఈ నెల 12న పాఠశాలలు పునః ప్రారంభం రోజే ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యాకానుక కిట్లను తమ పాఠశాలలకు తీసుకెళ్తున్నారు. శుక్రవారం పట్టణ, గ్రామీణ ప్రాంతాల పాఠశాలల హెచ్ఎంలు జగనన్న విద్యా కానుక కిట్లను తీసుకెళ్లారు. పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, డిక్షినరీలు, దుస్తులు, బూట్లు, సాక్సులు, నోట్ పుస్తకాల కిట్లును తయారు చేసి విద్యార్థులకు అందించనున్నట్లు మండల విద్యాధికారి బి.శివరాములు తెలిపారు.

భారీగా అక్రమ మద్యం పట్టివేత



మద్యం బాటిళ్లు, మోటార్ సైకిల్స్, నిందితులను చూపుతున్న డీఎస్పీ సీతారామయ్య

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి పంప్ హౌస్ సమీపంలో తుంగభద్ర నది ఒడ్డున అక్రమంగా తరలుతున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి ఐదు మోటారు సైకిళ్లు, 40 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను శుక్రవారం సీఐ ఎరిసావలి, ఎస్ఐ రాజారెడ్డితో కలిసి డీఎస్పీ సీతారామయ్య విలేకరులకు వెల్లడించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం

హాలహర్వి: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని అర్ధగేరి గ్రామానికి చెందిన సుంకన్న కుమారుడు వీరేష్(26) సొంతపని నిమిత్తం సాయంత్రం కర్ణాటక రాష్ట్రం గోనేహాళ్ గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి అర్ధగేరి గ్రామానికి బయలుదేరాడు. కాసేపటికే మార్గమధ్యలో గోనేహాళ్ వద్ద తలకు తీవ్ర గాయాలై విగతజీవిగా రోడ్డుపై పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని ఉంటుందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. కాగా పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

దైవ దర్శనానికెళ్లి..

- కర్ణాటకలో రైలు ఢీకొని మహిళ మృతి



నాగలక్ష్మి (ఫైల్)

హొళగుంద: దైవ దర్శనం కోసం కర్ణాటకలోని ఉలిగి పుణ్య క్షేత్రానికి వెళ్లిన హొళగుంద మండలం గజ్జహళ్లి గ్రామానికి చెందిన బోయ కొత్తింటి నాగలక్ష్మి (23) రైలు ఢీకొని మృతిచెందారు. వివాహితురాలైన ఈమె గురువారం బంధువులతో కలిసి ఉలిగికి వెళ్లారు. రాత్రి ఆలయం వద్దే నిద్రించిన ఆమె శుక్రవారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు పక్కనున్న రైలు పట్టాలు దాటి వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో ఆ పట్టాలపై చీర కొంగు చిక్కుకుంది. తీసుకునేలోపు రైలు వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతురాలు నాగలక్ష్మికి భర్త బొజ్జయ్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



రైతులకు వేరుశనగలను అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయ ఆవరణంలో సబ్సిడీ వేరుశనగ కాయలను వ్యవసాయాధికారి రాజు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు పి.మురళీమోహన్‌రెడ్డిలతో కలిసి రైతులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయాన్ని చంద్రబాబు నాయుడు దండగా అన్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రం వ్యవసాయాన్ని పండుగలా మార్చి రైతన్నలకు దన్నుగా నిలిచారన్నారు. రైతన్న సంక్షేమం కోసం విప్లవాత్మక సంస్కరణలు అమల్లోకి తెచ్చారని, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ ఉచిత పంట బీమా, వైఎస్సార్ యంత్ర సేవ, వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్, ధరల స్థిరీకరణ తదితర పథకాలను ప్రవేశపెట్టి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. గతంలో విత్తనాల కోసం పట్టణ కేంద్రాలకు వెళ్లి రోజుల తరబడి క్యూలో వేచి ఉండే దుస్థితి లేకుండా, గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రం వద్దనే విత్తనాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రైతుల ఇబ్బంది పడకుండా ఉన్న ఊళ్లోనే ఎరువులు, సబ్సిడీ, యంత్రాలు, పరికరాలు, వ్యవసాయ సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. వ్యవసాయాధికారు రాజు మాట్లాడుతూ 300 క్వింటాళ్ల వేరుశనగ, 10 క్వింటాళ్ల జీలుగా విత్తనాలతో పాటు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేసుకుని తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి ఉపాధ్యక్షుడు బెట్టన గౌడ, వైఎస్సార్ సీపీ నాయకులు మహంతేష్ స్వామి, మంగమ్మ, నాడుగేని నాగరాజు, జగదీష్ స్వామి, బుళ్లి నరసింహులు, గానిగ వీరస్వామి, మల్లికార్జున గౌడ, నరసింహులు గౌడ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఆదోని అర్బన్: పట్టణంలోని కల్లుబావి 132 కేవీ ఎస్‌లో మరమ్మతులు చేపడుతుండడం వల్ల శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీ చంద్రశేఖర్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆదోని నియోజకవర్గం, కౌతాళం మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

కౌతాళం: విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని మండల ట్రాన్స్‌కో ఏఈ నర్సన్న తెలిపారు. రెండో శనివారం కావడంతో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

11న ప్రవేశ పరీక్ష

మంత్రాలయం: మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామ శివారులో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి ఈ నెల 11న పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకుని 9 గంటల కంతా పాఠశాల వద్దకు చేరుకోవాలన్నారు. హాల్ టిక్కెట్‌తో పాటు పరీక్ష ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్ తీసుకురావాలన్నారు.

- కోసిగి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 11న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందన

ఆదోని రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో 2023 ఏప్రిల్ నెలలో అధిక మైలేజీ సాధించిన డ్రైవర్లు, అత్యధిక ఆదాయం ఆర్జించిన కండక్టర్‌లను స్థానిక డిపో గ్యారేజీలో ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి

ఆదోని అర్బన్: మండలంలోని దొడ్డనగేరి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మునిస్వామిపై టీడీపీ నాయకులు రెండు రోజుల క్రితం దాడి చేసి గాయపరిచారు. శుక్రవారం బాధితుడు తెలిపిన వివరాలు.. పని ఉందంటూ దొడ్డనగేరి గ్రామానికి చెందిన వీరేంద్ర, శ్రీరాములుతో పాటు మరో ముగ్గురు టీడీపీ నాయకులు తనను ఆదోనికి పిలిపించి బీర్ బాటిళ్లతో దాడి చేశారని అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మునిస్వామి విలేకరులకు తెలిపారు. తనకు గాయాలు కావడంతో బంధువులు ఏరియా ఆస్పత్రికి తరలించారని, అక్కడ చికిత్స అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. కాగా బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వద్దు

కౌతాళం: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ సుబ్బారాజు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయో మెట్రిక్ అటెండెన్స్ తప్పని సరి అన్నారు. వైఎస్సార్ బీమాను అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. సచివాలయాల్లో ఎప్పటి పనుల్ని అప్పుడే పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. సమావేశంలో కార్యదర్శులు ఏపీఎం రాజశేఖర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ..

మండల పరిధిలోని తోవి, ఏరిగేరి సచివాలయాలను తనిఖీ చేసి రికార్డుల్ని పరిశీలించారు. బయోమెట్రిక్ అటెండెన్స్‌ను తనిఖీ చేశారు. ఈ సరివ్వస్ రిక్వెస్టులు వైఎస్సార్‌బీమా నమోదును ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు.


ఈదురు గాలుల బీభత్సం



నేలమట్టమైన సోలార్ విద్యుత్ పంప్‌సెట్లు

- కొట్టుకుపోయిన సోలార్ పంప్ సెట్లు, విద్యుత్ స్తంభాలు
- రూ.10 లక్షలకు పైగా ఆస్తి నష్టం





నేలమట్టమైన విద్యుత్ స్తంభాలు

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం, ఐరన్‌గల్లు, సాతనూరు గ్రామాల్లో గురువారం రాత్రి భారీగా ఈదురు గాలులు, ఓ మోస్తరులో వర్షం బీభత్సం సృష్టించాయి. ఈదురు గాలులకు ఆయా గ్రామాల్లో రెండు మెయిన్ లైన్‌లో విద్యుత్ స్తంభాలు పడిపోగా, మరో 11 వ్యవసాయ పొలాల విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. 8 చెట్లకు పైగా పడిపోయాయి. దీంతో పాటు సాతనూరు వ్యవసాయ పొలాల్లో జంపాపురం గ్రామానికి చెందిన వణికేరి నాగరాజు, సోమనాథ్, ఇస్మాయిల్‌లకు చెందిన సోలార్ విద్యుత్ పంప్ సెట్లు ఈదురు గాలులకు కొట్టుకుపోయాయి. ఒక్కో సోలార్ సెట్‌ను రూ.3.20 లక్షలతో వెచ్చించి పంప్ సెట్‌లను మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసుకున్నట్లు రైతులు తెలిపారు. అయితే ఈదురు గాలులకు పడిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. మా ఏరియా ప్రాంతంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు లేవని, దీంతో గతంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ ధరలతో సోలార్ పంప్ సెట్లు ఏర్పాటు చేసుకున్నామన్నారు. సోలార్ ప్లేట్స్ కొట్టుకుపోయి విద్యుత్ సరఫరాకు తీవ్ర నష్టం ఏర్పడిందని రైతులు ఆరోపించారు. సొంతంగా కొత్తగా సోలార్ పంప్‌సెట్లు ఏర్పాటు చేసుకోవాలంటే దాదాపు రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతోందని వాపోయారు. సోలర్ ఉందని ఆశతో బోరు కింద పత్తి పంట సాగుచేసుకున్నామని, రెండు రోజుల్లో నీరు అందించకపోతే సాగుచేసుకున్న పంటలు పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈదురు గాలులకు కోల్పోయిన సోలార్ విద్యుత్ పంప్ సెట్లకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు. అలాగే మెయిన్ లైన్ విద్యుత్ స్తంభాలను, తీగలను వెంటనే మార్చి జంపాపురం, ఐరన్‌గల్లు గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు ట్రాన్స్ కో ఏఈ వీరేష్ తెలిపారు. వ్యవసాయ పొలాల్లో విద్యుత్ స్తంభాలు వచ్చిన వెంటనే మార్చుస్తున్న విద్యుత్ సరఫరా ఇస్తామన్నారు.

సన్మానం

కోసిగి: ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉంటూ అందిస్తున్న జర్నలిస్ట్ సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కొనియాడారు. కోసిగికి చెందిన విలేకరి రామన్న ఇటీవల బహుముఖ ప్రజ్ఞశాలి అవార్డు అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్త్రీశక్తి భవన సమావేశ భవనంలో ఎమ్మెల్యే సన్మానించారు.